# మినీ కథలు




"ఏయ్! వయ్యారి భామా! వగలమారి పిల్లా! నా వైపు చూడవే"

"………"

"నీ నడకలో హొయ లున్నవి చానా!"

"…………"

"నువు—నడుస్తువుంటే నిలువదె నా మనసు."

"…… ……"

"ఓ లలనా! ఓ సుగువా! చూడవె నా వైపు!" గబగబా అడుగులేస్తున్న సుజాత వెనక్కితిరిగి ఓ స్మైల్ విసిరింది. రోడ్డు పక్కనవున్న నియాన్ లైట్ల కాంతిలో ఆ నవ్వు తెల్లగా మెరిసిపోయింది. వెనకాలే అనుసరిస్తూ నడుస్తున్న శేఖర్ ఎగిరి గంతేసి ఈలేశాడు.

రాత్రి 9గంటల సమయం. మొదటి ఆట వదిలారు. జనం అంతా వెళ్ళిపోయారు. అందుకనే శేఖర్ ఈల విని హీరో వర్షిప్ చేయటానికి రోడ్డుమీద మరెవరూలేరుకాని. వెనక కొంతదూరంలో నక్కి నక్కి నడుస్తున్న శేఖర్ మిత్రుల గుండెలు దడదడమన్నాయి. అసలు వాళ్ళకోసమే ఈల వేశాడు శేఖర్.

శేఖర్ అమలాపురంకాలేజీలో ఓ చిన్న సైజు హీరో. అందగాడనే చెప్పాలి. సుజాతని మాత్రం అందరూ కాలేజీ బ్యూటీ అంటారు. ఎంత అందగత్తో అంత పెంకిదని కూడా స్టూడెంట్స్ జనవాక్యం. ఆ పెంకి గుర్రాన్ని లొంగదీసి తన వల్లో వేసుకుంటానని శపథం చేశాడు శేఖర్. శేఖర్ కాన్ఫిడెన్సుకి కారణం లేకపోలేదు. చాలా మంది గరల్ స్టూడెంట్సు అతనంటే పడి ఛస్తారని పుకారు. అయితే ఈ ప్రయత్నంలో, శేఖర్‌కి డీఫీటు తప్పదని అతని మిత్రుల గట్టి అంచనా. తమ అంచనా ఎంతవరకు గట్టిదో తేల్చుకోటానికే వాళ్ళు వెనకాల నక్కినక్కి నడుస్తున్నారు. ఇప్పుడు వాళ్ళకి, శేఖర్ వేసిన ఈల ఒక అశనిపాతం అయికూర్చుంది. అయినా పట్టు వదలని విక్రమార్కుల్లాగా ముందుకు సాగుతూనే ఉన్నారు.

ఇనుమడించిన ఉత్సాహంతో శేఖర్ కొంచెం స్పీడు పెంచాడు. సుజాత కూడా మరీ స్పీడుగా నడుస్తూ వెనక్కి తిరిగి ఒక వాలుచూపు విసిరింది. తన గమ్యసాధనలో ఆ చూపు మరో మైలురాయిగా ఫీలయ్యాడు శేఖర్. రెట్టించిన విజయగర్వంతో శేఖర్ ఒకడుగు ముందుకువేసి "డార్లింగ్" అని సుజాత చేతిని మృదువుగా పట్టుకోబోయాడు.

"ఉండు, డియర్!" అని చిరునవ్వుతో చేయి పక్కకిలాగి నడక స్పీడు పెంచింది సుజాత.

పక్కనే నడుస్తున్న శేఖర్, "నీ ప్రేమనందుకోగలిగిన నాకు ఎవరెస్టు శిఖరాన్నధిరోహించినట్టుంది సుజాతా" అన్నాడు.

"ఊహూ!" అంది సుజాత వయ్యారంగా.

"నిజం డార్లింగ్. ఈ ప్రపంచంలో నా అంత అదృష్టవంతుడెవ్వడూ లేడు." ఓరచూపుతో అన్నాడు శేఖర్.

'అలానా!' అన్నట్టు సుతారంగా చూసింది సుజాత.

"ఇంక నువ్వు నాదానివి. నేను నీవాడిని. నీకోసం ఏదైనా చేస్తాను సుజాతా" షర్టు కాలరు సర్దుకుంటూ అన్నాడు శేఖర్.

"అబ్బా" అని కృతజ్ఞతాపూర్వకంగా నవ్వింది సుజాత.

వెనకనించి అంతా చూస్తున్న శేఖర్ మిత్రులు కుదేలయిపోతున్నారు. "శేఖర్ అన్నంత పనీ చేశాడురా. సుజాతనే వల్లో వేసుకున్నాడు క్షణాల్లో"—ఆశ్చర్యపడిపోతున్నారు శేఖర్ మిత్రులు. ఇంకేం జరుగుతుందో చూద్దాం అనే క్యూరియాసిటీతో ముందుకు మాత్రం సాగుతూనే ఉన్నారు.

అందరి నడక సాగుతూనే ఉంది. బస్ స్టేషన్ దగ్గరకి వచ్చేటప్పటికి జనసంచారం కనిపించింది. సుజాత స్టేషను ఆవరణలోకి ప్రవేశించింది. ప్రక్కనే శేఖర్ వున్నాడు. అమలాపురం కాలేజీలో చదువుతున్న సుజాత రోజూ ముమ్మిడివరం నుంచి వచ్చి వెళుతూ ఉంటుంది. ఆ రోజు కమల ఇంటికి వెళ్ళి రావటం వల్ల రోజూ కంటే ఆలస్యంగా చేరింది బస్ స్టాండుకి. ఇక లాస్ట్ బస్సే వుంది. పదింపావుకు కానీ బయల్దేరదు. ప్రయాణం హడావుడిలో అటూఇటూ తిరుగుతున్న జనం చుట్టూ ఉన్నారు. సుజాత చటుక్కున పక్కకి తిరిగి వెకిలి నవ్వు నవ్వుతూ నుంచున్న శేఖరు చెంప ఛెళ్ళుమనిపించింది.

జనం చుట్టూ మూగారు. ఇది ఈవ్ టీజింగ్ వ్యవహారం అని వెంటనే గ్రహించిన ప్రజానీకం, శేఖర్‌ని నానా తిట్లూ తిట్టి, చెంపలు వాయించారు. దూరంగా వున్న శేఖర్ మిత్రులు ముందుకు దూకితే వాళ్ళ గతేమవుతుందో ఊహించుకుని, వెనకనించే చల్లగా జారుకున్నారు.

"పోలీసులకప్పగిద్దాంరా. ఈ రోడ్ సైడు రోమియోసంగతి వాళ్ళే చూసుకుంటారు." అన్నాడు ఒకడు గుంపులో. అదే తడవుగా విస్తుపోతూ నోటమాటరాకుండా నుంచున్న

శేఖర్‌ని లాక్కుపోబోయారు కొందరు.

సుజాత వాళ్ళని ఆపుచేసి. "ఇంక చాలు ఊరుకోండి! ఈపాటికి బుద్ధొచ్చుంటుంది హీరోకి! ఇక వదిలేయండి పాపం" అంది వళ్ళు కొరుకుతూనే.

"ఏమిటమ్మా! ఇటువంటి బేవార్సుగాణ్ణి వదిలేయమంటావా!" అని కళ్ళు పెద్దవి చేసారు అందరూ.

"నామాట విని వదిలేయండి. ఇతనెవరో కాదు నా క్లాసమేటే. ఏదో బుద్ధి గడ్డితిని చేసాడీ రోజు. ఇక బుద్ధొచ్చుంటుంది." అని బతిమాలింది సుజాత.

ఆ జనం విసుక్కుంటూ. "ఇదెక్కడి లిటిగేషనురా. మధ్యన మనం ఫూల్స్ అయ్యాం. వాళ్ళూ వాళ్ళూ ఒకటే. పోదాం పదండిరా" అంటూ సుజాతని కూడా సున్నితంగా తిట్టుకుంటూ, చెల్లా చెదరయి పోయారు.

ఇంకా పూర్తిగా తేరుకోని శేఖర్‌ని చూసి సుజాత. "జాగ్రత్త! బి కేర్‌ఫుల్! సుజాత అంటే ఇప్పటికయినా తెలిసిందా!" అని ఓ ఉరుము ఉరిమి అప్పుడే ప్లాట్‌ఫారమ్ దగ్గరకొచ్చిన ముమ్మిడివరం బస్సెక్కి కూర్చుంది. విగ్రహంలా నిలబడిపోయాడు శేఖర్.

---




# స్పందన

"నాంపల్లి స్టేషను కాడ...." సినిమా పాట ట్రాన్సిస్టర్‌లో వీనుల విందు చేస్తున్నది. ఉన్నది నాంపల్లి స్టేషన్లో కాబట్టి ఆ పాట అద్భుతమనిపించింది. స్టేషన్ చాలా సందడిగా ఉంది. టీ. కాఫీల అరుపులూ. హడావిడిగా తిరిగే ప్యాసింజర్లు. జీవితమే ఒక ప్రయాణం. ఆ ప్రయాణంలో ఈ హైద్రాబాదు నుంచి వాల్తేరు ప్రయాణం ఓ కొత్త మలుపు. హైదరాబాదు రాజధాని నగరం అవడం వలన అందంగా. విశాలంగా భాగ్యనగరంలా కనిపించింది తన కళ్ళకు. తన జీవితంలో మొదటిసారి హైదరాబాద్ వచ్చాడిలా ఇంటర్వ్యూకి. ఎం. ఏ. ఫస్ట్ క్లాసులో పాసై వట్టువదలని విక్రమార్కునిలా ఈ ఐదేళ్ళ బట్టి కొన్నివందల ఇంటర్వ్యూలకి వెళ్ళేడు తను– ఉత్తర దక్షిణలు లేక తన ఎం. ఏ. సర్టిఫికేట్ తనను వెక్కిరిస్తూంది. కానీ ఏదో ఆశ.... ఈ సారి కూడా ఇంటర్వ్యూ ఎప్పటిలాగా బాగానే చేశాడు. కానీ తను మాత్రం ఉద్యోగం వస్తుందని ఆశమాత్రం పెట్టుకోలేదు. ఆ రోజుల్లో.... యూనివర్సిటీలో స్నేహితులతో ఎంత సందడిగా గడిచిపోయిందో తలచుకుంటే మనసెంత హాయిగా ఉంటుందో! ఈ ఇంటర్వ్యూ అయినా తనను గట్టెక్కిస్తే తనకో ఉద్యోగం వస్తే తన సంపాదన కోసం చూసే తండ్రి. తల్లి. చెల్లిని ఆనందింపచేయవచ్చు.. మనసంతా పరిపరివిధాల ఆలోచిస్తున్నది!

"మాస్టారూ ఇక్కడున్నారా మీరు. ఇంత సేపటి నుంచి మీ కోసమే చూస్తున్నాను. అమ్మయ్య-ఇప్పటికి కనబడ్డారు. సంతోషం. మనది వైజాగ్ కదూ!...." కొత్త వూరిలో అపరిచిత వ్యక్తి తనను తను పరిచయం చేసికొన్నాడు.

'ఈ మనిషినెక్కడా చూసినట్లు లేదే. బహుశా మరచిపోయి వుంటానేమో' అనుకుని -"మీకెలా తెలుసు" అడిగాను.

"ఆ మీరు నాకు బాగా తెలుసు. నన్ను మర్చిపోయి వుంటారు. అలాఅంత తొందరగా మర్చిపోతే ఎలాగండి? రామగోపాలం ఎలా వున్నాడు?"

"రామగోపాలమా. అసలు అలాంటి వ్యక్తి నాకు తెలియదే. ఓహ్ డాక్టర్ గోపాలకృష్ణ గురించా మీరు మాట్లాడేది?" నాకు బాగా పరిచయమున్న వ్యక్తి. అతన్ని గురించి మాట్లాడుతున్నాడేమోనని చెప్పాను బాగుండదని.

"అవునండి. వాడే! ఆ డాక్టర్ కృష్ణగాడ్ని నేను రామగోపాలం అనిపిలుస్తాలెండి! నాకు చాల మంచి ఫ్రెండ్. మిమ్మల్ని గోపాలంగాడితో చాలాసార్లు చూశాను. అయినా మనం మనం వాల్తేరు వాళ్ళం కదా! ఇందాకటినుంచి మీరు పడుతున్న బాధ అంతా చూసి. వుండలేక పలకరిద్దామని వెతుక్కుంటూ వచ్చేశా. మిమ్మల్ని చూస్తే నా తోడబుట్టిన తమ్ముడ్ని చూసినట్లుంది. వెధవ-వైజాగ్‌లో డిగ్రీ వెలగబెడుతున్నాడు."

"నేను బాధపడడమా. అలాటిదేమీ లేదే...." అన్నాను. చాల కలగొలుపు మనిషిలా వున్నాడు. చూస్తే చాల ముచ్చటేసింది. మనుషులంతా ఇలావుంటే కొత్త పాత వుండనే వుండదు!

"అదేనండి.... ఇంవాక మీరు చాల సేపు